క్లుప్తంగా

వైభవంగా కుంభాభిషేకం



కుంభాభిషేకంలో పాల్గొన్న భక్తులు

మామిడికుదురు: బి.దొడ్డవరంలో వల్లీ,దేవసేన సమేత బాలసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం నిర్మించి పన్నెండేళ్లు పూర్తైన సందర్భంగా సోమవారం కుంభాభిషేకం నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ ఈ కార్యక్రమాన్ని ఆద్యంతం అంగరంగ వైభవంగా జరిపించారు. ఆలయ వ్యవస్థాపకుడు చెల్లుబోయిన నాగేశ్వరరావు, భారతి దంపతులు ప్రధాన కర్తలుగా పాల్గొన్నారు. పెదపట్నానికి చెందిన వేద పండితుడు బ్రహ్మశ్రీ గంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామికి పూజలు జరిపించారు. ఆలయ శిఖరంపై నుంచి భక్తులు బూరెలు వేసి మొక్కులు తీర్చుకున్నారు. భారీ సంఖ్యలో భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యం



అంతర్వేదిలో భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

సఖినేటిపల్లి: రాష్ట్రంలో రైతు సంక్షేమానికి సీఎం జగన్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తుందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం అంతర్వేదిలో బెల్లంకొండ వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన స్థలంలో నిర్మించిన నూతన వ్యవసాయ సహకార భవనాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. బెల్లంకొండ రాజన్న పేరుతో నిర్మించిన ఈ భవనం ద్వారా రైతులకు అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, మాజీ సర్పంచ్ పోతురాజు నాగేంద్రకుమార్, ప్రజాప్రతినిధులు కొండా జాన్‌బాబు, పోతాబత్తుల భాస్కరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు దూది త్రినాథ్, నాయకులు బెల్లకొండ సూరిబాబు, గెడ్డం అమ్ములు, కేఎస్ఎన్ రాజు, బెల్లంకొండ అబ్బులు, దొంగ నాగ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కలాల పంపిణీ



విద్యార్థులకు కలాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామి ఆలయంలో చదువుల పండగ పేరుతో నిర్వహించిన ప్రత్యేక పూజల సందర్భంగా స్వామివారి పాదాల చెంత లక్ష కలాలు ఉంచారు. వీటిని స్థానిక ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సోమవారం విద్యార్థులకు, భక్తులకు పంపిణీ చేశారు. ఈ కలాలతో పరీక్షలు రాస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయని విద్యార్థుల నమ్మకం. ఈ నమ్మకానికి ప్రతీకగా ఏటా ఈ పూజలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కలాలు తీసుకుని విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధించాలని ఆయన ఆకాంక్షించారు. తొలుత ఎమ్మెల్యేకు అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆయన వెంట చైర్మన్ నంబూరి వెంకటరమణరాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, పలువురు నాయకులు ఉన్నారు.

బొండు ఇసుక తవ్వుతున్న జేసీబీ సీజ్

కొత్తపేట: ప్రభుత్వ అనుమతులు లేకుండా బొండు ఇసుక తవ్వుతున్న జేసీబీని సీజ్ చేసినట్టు ఎస్ఐ వి.మణికుమార్ తెలిపారు. స్థానిక బోడిపాలెం వంతెన సమీపంలోని సూర్యగుండాల పాయ (తొగరిపాయ)లో ఆదివారం అర్ధరాత్రి అక్రమంగా బొండు ఇసుక తవ్వుతున్నట్టు అందిన సమాచారం మేరకు ఎస్ఐ సిబ్బందితో వెళ్లారు. అక్కడ బొండు ఇసుక తవ్వి గుట్టలుగా పోసి ఉండటాన్ని గుర్తించారు. ఆ సమయంలో అక్కడ ఉన్న జేసీబీని సీజ్ చేశారు. దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

అందరికీ తాగునీరు అందించాలన్నదే లక్ష్యం

సఖినేటిపల్లి: గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ రక్షిత తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం రామేశ్వరంలో సమగ్ర రక్షిత తాగునీటి పథకం చెరువు వద్ద రూ.23 లక్షలతో ఏర్పాటు చేసిన మైక్రోఫిల్టర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. సర్పంచ్ కట్టా ఉమామహేశ్వరరావు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ, వైస్ ఎంపీపీ-2 రుద్రరాజు చినరాజా, ఎంపీటీసీ దొండపాటి సునీత, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, నాయకులు కేఎస్ఎన్ రాజు, కె.అశోక్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

చరిత్రకు సాక్ష్యం భట్టి విక్రమార్కుని ఆలయం

- నేటి నుంచి కల్యాణ మహోత్సవాలు
- దక్షిణ భారతదేశంలోనే తొలి ఆలయం
- 30 అడుగుల ఎత్తులో విగ్రహాలు

ఆలమూరు: దక్షిణ భారతదేశంలోనే ఏకైక ఆలయంగా వెలుగొందుతున్న ఆలమూరులోని విక్రమ భట్టీశ్వరస్వామి కల్యాణోత్సవాలు మంగళవారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఏటా మాఘ బహుళ దశమి నుంచి ఏడురోజుల పాటు జరగనున్న ఈ ఉత్సవాలను ఆలయ కమిటీ శైవాగమ పాంచాహ్నిక దీక్షతో వైభవంగా నిర్వహించనుంది. ఆలయానికి వేల సంవత్సరాల చరిత్ర ఉంది. శతాబ్దాల చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచిన ఈ దేవాలయం నేటికి చెక్కుచెదరకుండా ఉంది. పురాణ ప్రాశస్త్యం సంతరించుకున్న ఈ ఆలయాన్ని కాళికా భక్తుడైన విక్రమార్కుడు నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది. విక్రమార్కుని కాలంలో పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా యుద్ధాలు జరగడంతో ఈ ప్రాంతానికి ఆలమూరుగా పేరు వచ్చిందని పెద్దలు చెబుతారు. తపోశక్తి ద్వారా కాళికామాత వరాలు పొందిన విక్రమార్కుడు యుగకాలం పాటు జీవించి ఉజ్జయిని రాజ్యాన్ని పాలించాడు. అనంతరం శాలివాహనుడు ఉజ్జయిని రాజ్యంపై దండెత్తడానికి సమాయత్తమవుతుంటాడు. నిస్సహాయ స్థితికి చేరుకున్న విక్రమార్కుడు తన మరణం చరిత్ర హీనం కాకూడదనే ఉద్దేశంతో తన మంత్రి భట్టి సలహాతో రాజరిక వ్యవస్థలో నిలిచిపోయేలా వారిరువురి పేరిట గ్రామంలో భట్టి విక్రమార్కుని ఆలయాలను నిర్మించాడని ప్రతీతి. ఈ ఆలయాలను కొన్ని శతాబ్దాల క్రిందట గ్రామానికి నడిబొడ్డున 30 అడుగుల ఎత్తులో స్వచ్ఛమైన పుట్టమన్ను, సాధారణ మట్టి ఇటుకలతో నిర్మించారు. శాలివాహనుడు యుద్ధం చేసేందుకు సరిహద్దుల్లోకి ప్రవేశిస్తున్న సమయంలో గ్రామ సమీపంలోని భువనేశ్వరి ఆలయంలో విక్రమార్కుడు తన ఖడ్గంతో ఆత్మాహుతి చేసుకున్నాడు. తదనంతరం పాలకులు ఈ ఆలయాన్ని పలుమార్లు మరమ్మతులు చేయడంతో పాటు రహదారులను ఆధునీకరించడంతో ఆలయం ఎత్తు క్రమేపీ తగ్గుతూ వస్తుంది.



ఆలమూరులోని విక్రమ భట్టీశ్వరస్వామి ఆలయం



పార్వతీ సమేత విక్రమాదిత్యుడు



పార్వతీ సమేత భట్టీశ్వరస్వామి

చరిత్రకు సాక్ష్యంగా భువనేశ్వరి చెరువు

విక్రమాదిత్యుడు నిర్మించిన భువనేశ్వరి ఆలయం కాలగర్భంలో కలిసిపోగా చరిత్రకు సాక్ష్యంగా భువనేశ్వరి చెరువు గ్రామంలో ఉంది. ఈ చెరువును విక్రమాదిత్యుడి హయాంలో నిర్మించినట్లు చరిత్ర చెబుతుంది. పూర్తి శైవ బ్రాహ్మణ అర్చకత్వంలో ఈనెల 31 నుంచి వచ్చే ఫిబ్రవరి 06 వరకూ ఆలయంలో పార్వతీ సమేత విక్రమ భట్టీశ్వరస్వామి వారి కల్యాణోత్సవాలు ఐదు రోజుల పాటు వైభవంగా జరగనున్నాయి. స్వామికి అభిషేకాలు, కుంకుమార్చనలు, బలిహరణ, నిత్యౌపాసన, అఖండ దీపారాధన, విశేషార్చనలు, కుంకుమపూజలు, పూర్ణాహుతి, త్రిశూల స్నానం, తోలు బొమ్మలాట, పుష్పోత్సవం జరగనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. విక్రమ భట్టీశ్వరుని ఆలయంలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ చూపరులను విశేషంగా ఆకట్టుకుంది.

రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి

ఆత్రేయపురం: రైతులు వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని గుంటూరు వ్యవసాయ శాఖ కమిషనరేట్ ఏడీఏ ఎ.మధులేటి రైతులకు సూచించారు. సోమవారం డాక్టర్ వైఎస్సార్ పొలంబడి క్లస్టర్‌ని ఆయన పరిశీలించారు. ప్రాజెక్టు కింద 250 ఎకరాల్లో మేలైన వ్యవసాయ పద్ధతులు, ధ్రువీకరణ పొలంబడి క్లస్టర్‌ని ఆత్రేయపురం మండలంలో పేరవరం, వెలిచేరు, రాజవరం, వద్దిపర్రు గ్రామాల్లో నిర్వహించిన పంట పొలాలను పరిశీలించారు. రైతులతో పాటు పొలంబడి కార్యక్రమంలో పాల్గొని పిలకలు తొలగించడం, ఆకులు కత్తిరించడం చేసి వాటి గురించి వివరించారు. రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ రాజశేఖర్, కొత్తపేట ఏడీఏ రామారావు, ఏవో జేవీ పట్టాభిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

విమర్శలు లేని పాలన సీఎంకే సాధ్యం

- ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు
- క్రాప శంకరాయగూడెంలో గడప గడపకూ..

అయినవిల్లి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం రాష్ట్రంలో విమర్శలు లేని పాలనను అందిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు తెలిపారు. సోమవారం మండలంలోని క్రాప శంకరాయగూడెంలో ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో గడపగడపకూ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు గ్రామంలో గడపగడపకూ వెళ్లి ప్రభుత్వ పాలన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరుతున్నాయా? లేదా? అని అడిగారు. ప్రతిపక్షాలు విమర్శలు కావాలనే చేస్తున్నారు తప్ప వారికి ఎక్కడ విమర్శించే అర్హత లేదన్నారు. పాడైన గ్రామీణ రహదారులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. రాష్ట్రం ప్రగతి పథంలో నడుస్తుందన్నారు. నవరత్నాలు పేరిట ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొక్కా కామేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు గుత్తుల శ్రీరామ్మూర్తి, కుడుపూడి విద్యాసాగర్, వాసంశెట్టి పుల్లంశెట్టి, వేటుకూరి వెంకట్రాజు, వేటుకూరి సుబ్బరాజు, కొండేటి స్టాలిన్ బాబు, పచ్చిమాల సుబ్బారావు, కన్నబాబురాజు, కాశీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



క్రాప శంకరాయగూడెంలో మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన అధికారులు

సఖినేటిపల్లి: అంతర్వేది తీర్థంలో ఉత్సవ ఏర్పాట్లను అమలాపురం ఆర్డీవో ఎస్ఎస్‌వీబీ వసంతరాయుడు, డీఎస్పీ వై.మాధవరెడ్డి, కేవీ రమణలు సోమవారం పరిశీలించారు. ప్రధానంగా మంగళవారం రాత్రి జరిగే కల్యాణం జరిగే చోట తీసుకోవాల్సిన చర్యలను ఆర్డీవో, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులతో చర్చించారు. వీఐపీ గ్యాలరీల గురించి డీఎస్పీలు మాధవరెడ్డి, రమణలతో చర్చించారు. వీటితో పాటు కల్యాణం వేదిక ఇరువైపులా ఉన్న భారీ షెడ్లలో సాధారణ భక్తులు స్వామివారి కల్యాణం కనులారా వీక్షించేందుకు అవసరమైన ఏర్పాట్లు, షెడ్ల వెలుపల నుంచి చూసే భక్తుల కోసం భారీ స్క్రీన్స్ ఏర్పాటు గురించి కూడా ఆయన అసిస్టెంట్ కమిషనర్‌తో ఆర్డీవో చర్చించారు. వీటితో పాటు కల్యాణం అనంతరం తలంబ్రాలు క్రతువు పూర్తయిన అనంతరం తొక్కిసలాట లేకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వెంట గ్రూపు టెంపుల్స్ ఈవో బి.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ వై.రామకుమారి, ఎంపీడీవో జి.భీమారావు, ఎస్సై అడపా ఫణిమోహన్ పాల్గొన్నారు.



అంతర్వేదిలో కల్యాణం జరిగే చోట ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఆర్డీవో వసంతరాయుడు

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

అంబాజీపేట: రైతు సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం జగన్ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. చిరతపూడిలో నూతనంగా నిర్మించిన సొసైటీ భవనాన్ని సొసైటీ అధ్యక్షుడు మట్టపర్తి ఏడుకొండలు అధ్యక్షతన ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే చిట్టిబాబు మాట్లాడుతూ సొసైటీల అభివృద్ధికి రైతుల భాగస్వామ్యం కావాలన్నారు. రైతులకు అధికారులు ప్రజా ప్రతినిధులు అందుబాటులో ఉంటూ వారి ఆర్థిక పురోభివృద్ధికి సహకరించాలన్నారు. రైతు ఆర్థికంగా ఎదిగేందుకు గ్రామల్లో ఆర్బీకే ఏర్పాటు చేసి వారికి కావలసిన ఎరువులు, విత్తనాలను వేగవంతంగా అందిస్తున్నారన్నారు. కారక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పేరి శ్రీనివాస్, సర్పంచ్ కోట బేబీరాణి, వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, లూటుకుర్తి శ్రీనివాసరావు, దారపరెడ్డి శ్రీనివాసరావు, కోట విజయరావు తదితరులు పాల్గొన్నారు.



చిరతపూడిలో నూతనంగా నిర్మించిన సొసైటీ భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం

మామిడికుదురు: గ్రామీణ ప్రాంతాల్లో రహదారులను పక్కా సిమెంట్ కాంక్రీట్ రోడ్లుగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మామిడికుదురు సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.5 లక్షలు, గన్నేరు పుంతలో మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు సర్పంచ్ మొహిద్దీన్, ఎంపీటీసీ వర్ధినేని రాము సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సీహెచ్ నిరంజని, పీఏసీఎస్ చైర్మన్ కట కంశెట్టి ఆదిత్యకుమార్, పార్టీ నేతలు కుసుమ శ్రీధర్, నయినాల సత్యమూర్తి, నయినాల రామకృష్ణ, కంచి శ్రీరామ్, అప్పన రామకృష్ణ పాల్గొన్నారు.

కొబ్బరిలో సంకరీకరణతో అధిక దిగుబడులు

అంబాజీపేట: కొబ్బరిలో అధిక దిగుబడులు సాధించేందుకు సంకరీకరణ మొక్కలు సాగు చేయాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ టి.జానకిరామ్ సూచించారు. కొబ్బరిలో సంకరీకరణపై కొబ్బరి అభివృద్ధి బోర్డు సాయంతో శిక్షణ ఇచ్చేందుకు స్థానిక కొబ్బరి పరిశోధనా కేంద్రంలో నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని ఉపకులపతి సోమవారం ప్రారంభించారు. వివిధ అంశాలపై ఆయన మాట్లాడారు. అనంతరం సంకరీకరణపై తెలుగులో ముద్రించిన పుస్తకాన్ని వీసీ ఆవిష్కరించారు. ఎనిమిది పదుల వయస్సులో కూడా కొబ్బరిచెట్టు ఎక్కడంతో పాటు శిక్షణ ఇస్తున్న జాతీయ అవార్డు గ్రహీత మామిడికుదురు మండలం పెదపట్నలంకకు చెందిన గిడుగు శేషగిరిరావును వీసీ జానకిరామ్ సన్మానించారు. తొలుత జానకీరామ్ పార్కింగ్ షెడ్‌ను ప్రారంభించి, సంకరీకరణ శిక్షణా సభ్యులకు క్షీర సురక్ష ఇన్సూరెన్స్ స్కీం సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం బోర్డు సభ్యులు జిన్నూరి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



కొబ్బరి సంకరీకరణ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఉపకులపతి

కొపనాతి కృష్ణమ్మ విగ్రహావిష్కరణ

రాజోలు: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ భక్తి మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. సోమవారం రాజోలు పాతబస్టాండ్ అగ్నికుల క్షత్రియ గ్రూపులో నూతనంగా ఏర్పాటు చేసి కొపనాతి కృష్ణమ్మ విగ్రహాన్ని ఆయన వంశీయుడు కొపనాతి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావులు ఆవిష్కరించారు. కృష్ణమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తాడి కొండయ్య మాస్టారు జ్ఞాపకార్థం ఆయన కుమారులు తాడి సత్యనారాయణ, ప్రసాద్, శ్రీనివాస్, శ్రీరామ్‌లు విగ్రహాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాపాక మాట్లాడుతూ కొపనాతి భక్తి భావాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అంతర్వేది ఆలయ నిర్మాణంలో కృష్ణమ్మ ఎంతో శ్రమించారన్నారు. ప్రస్తుతం ఆ ఆలయం ఎంతో కీర్తి ప్రతిష్టలు సాధించి ఎంతో మంది స్వామిని దర్శించుకుంటున్నారన్నారు. ఎంపీపీ కేతా శ్రీనివాసరావు, సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీలు చెల్లింగి లక్ష్మీఈశ్వరి, కొపనాతి పుష్పలత, దార్ల కుమారిలక్ష్మి, ఉప సర్పంచ్ పామర్తి రమణ, ది రాజోలు బోట్స్‌మన్, ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.



కొపనాతి కృష్ణమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రాపాక

విఘ్నేశ్వరుని సన్నిధిలో కలెక్టర్ పూజలు



అయినవిల్లి విఘ్నేశ్వరుని సన్నిధిలో కలెక్టర్ హిమాన్షుశుక్లా

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామిని జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా సోమవారం దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. తొలుత ఆలయ ప్రధానార్చకుడు వినాయకరావు, ఆలయ చైర్మన్ నంబూరి వెంకటరమణరాజు ఆలయ మర్యాదలతో జిల్లా కలెక్టర్‌కు స్వాగతం పలికారు. ఆయన వెంట ఈఓ ముదునూరి సత్యనారాయణ, తహసీల్దార్ రియాజ్ హుస్సేన్ తదితరులు ఉన్నారు.

రామరాజుకు సత్కారం

సఖినేటిపల్లి: ఇటీవల అమలాపురంలో ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న మండల వీఆర్వోల సంఘ అధ్యక్షుడు వి.రామరాజుకు సోమవారం స్థానికులు ఘనంగా సన్మానించారు. గుడిమూలలో జరిగిన కార్యక్రమంలో వారు సత్కరించి, మెమెంటోను బహూకరించారు. సర్పంచ్ దెందుకూరి శ్రీహరి రాజు, వైఎస్ ఎంపీపీ-2 రుద్రరాజు చినరాజా, మాజీ వైస్ ఎంపీపీ రుద్రరాజు సహదేవరాజు, మాజీ ఎంపీటీసీ కోన ప్రభాకర్, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, వీఆర్ఏలు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ ఆదర్శనీయుడు

కొత్తపేట: గాంధీ అహింసా మార్గాన్ని అనుసరించి శాంతియుత సమాజం అందరి లక్ష్యం కావాలని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. గాంధీ వర్ధంతిని పురస్కరించుకుని ఎంపీపీ కార్యాలయ ప్రాంగణంలో మహాత్ముని విగ్రహానికి ఎంపీపీ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నేలపూడి భీమరాజు, ఎంపీడీఓ మహేశ్వరరావు, ఈవోపీఆర్డీ వి.కృష్ణారెడ్డి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గాంధీజీ విగ్రహానికి ప్రిన్సిపాల్ కె.పెద్దిరాజు, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అరుణ్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. మండల ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో వాసవీ కన్యకాపరమేశ్వరీ కల్యాణ మండపం, సమితి రోడ్డు, పాత బస్టాండ్ సెంటర్, పంచాయతీ పార్కుల్లో గాంధీ విగ్రహాలకు ఆర్యవైశ్య సంఘాల నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. పలివెలలో దుళ్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మహాత్ముని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక విద్యాబాలమందిర్‌లో మహాత్ముని చిత్రపటానికి కరస్పాండెంట్ ఆర్.అనూరాధ పూలమాల వేసి నివాళులర్పించారు.

మామిడికుదురు: జాతిపిత మహాత్మాగాంధీ అందరికీ ఆదర్శనీయుడని మాజీ ఎమ్మెల్యే ఎంఏ వేమా, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు కీర్తించారు. గాంధీ వర్ధంతి పురస్కరించుకుని మామిడికుదురులో విగ్రహానికి వేమాతో పాటు పలువురు పూలమాల వేసి నివాళులర్పించారు. లూటుకుర్రులో గాంధీ చిత్రపటానికి తాతకాపు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో బీజేపీ, కాంగ్రెస్, ఆర్యవైశ్య నేతలు పాల్గొని నివాళులర్పించారు.

అంబాజీపేట: గాంధీ తన అహింసా మార్గంతో ప్రపంచ దేశాలకు ఆదర్శప్రాయుడయ్యారని మోకా ప్రకాష్ అన్నారు. తొండవరం జెడ్పీ హైస్కూల్‌లో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. అంతకుముందు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అలాగే మాచవరం పంచాయతీ వద్ద కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి నిర్వహించారు.



కొత్తపేట ఎంపీపీ కార్యాలయంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో గాంధీ వర్ధంతి జరిగింది. ఆలమూరులోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, గ్రామ సచివాలయాల్లో అధికారులు, సిబ్బంది గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంపీపీ కార్యాలయంలో నిర్వహించిన వర్ధంతిలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఎంపీడీఓ కె.జాన్ లింకన్ పాల్గొని ప్రసంగించారు. మండలంలోని సంధిపూడి, గుమ్మిలేరు చెముడులంక, చొప్పెల్ల పెదపళ్ల, మూలస్థాన అగ్రహారం గ్రామాల్లో గాంధీ విగ్రహాల వద్ద స్థానికులు, అభిమానులు పూలమాల వేసి నివాళులు అర్పించారు.

పి.గన్నవరం: గాంధీ వర్ధంతిని పి.గన్నవరంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పాబోలు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. సంఘ సభ్యులు గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు పాల్గొన్నారు. అలాగే మానేపల్లిలో గాంధీజీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గెల్లి మధుసూదన్, నాయకులు శ్రీఘాకోళపు బాపిరాజు, శిరం శ్రీను తదితరులు పూలమాల వేసి, నివాళులు అర్పించారు.

కుష్ఠు పక్షోత్సవాలు ప్రారంభం

కొత్తపేట: సమాజంలో అందరూ ఆరోగ్యంగా జీవించడానికి వైద్య, ఆరోగ్య సిబ్బంది, కార్యకర్తలు చిత్తశుద్ధితో పనిచేయాలని మోడేకుర్రు సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి సూచించారు. స్పర్శ (లెప్రసీ) వ్యాధి నివారణ పక్షోత్సవాల్లో భాగంగా అవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రవికుమార్ పర్యవేక్షణలో ఎంపీహెచ్‌ఓ కొమ్ముల మాచరరావు ఆధ్వర్యంలో, సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి సోమవారం మోడేకుర్రులో అవగాహన సభ నిర్వహించారు. ముందుగా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వ్యాధి నివారణపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వీడీసీ కన్వీనర్ కుడుపూడి వెంకటేశ్వరరావు, ఆరోగ్య విస్తరణాధికారి టీవీవీ సత్యనారాయణ, ఆరోగ్య పర్యవేక్షణాధికారి చప్పిడి వెంకటేశ్వరరావు, సచివాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: కుష్ఠు వ్యాధిని సమూలంగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నగరం పీహెచ్‌సీ వైద్యాధికారులు కేజే ప్రశాంత్, కె.స్వర్ణలత పిలుపునిచ్చారు. కుష్ఠు వ్యాధి నిర్మూలనకు కృషి చేస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. అందరి సమష్టి కృషితోనే కుష్ఠు వ్యాధిని నిర్మూలించవచ్చన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జాలెం రమణకుమారి, పీహెచ్‌సీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీల పరిధిలో సోమవారం కుష్ఠు వ్యాధి నిర్మూలన పక్షోత్సవాలు ప్రారంభమయ్యాయి. వైద్యాధికారులు డి.సువర్చలనాయుడు, పి.భవానీ శంకర్ నేతృత్వంలో వైద్యారోగ్య సిబ్బంది గ్రామ సచివాలయాల పరిధిలో స్పర్శ లెప్రసీ అవేర్‌నెస్ క్యాంపెయిన్ (స్లాగ్) నిర్వహించారు. కుష్ఠు వ్యాధి లక్షణాలు తెలియజేశారు. మండలంలో 91 కేసులు నమోదై ఉండగా అందులో చొప్పెల్ల పీహెచ్‌సీ పరిధిలో 37, పెదపళ్ల పీహెచ్‌సీ పరిధిలో 54 కేసులు వైద్యాధికారులు తెలిపారు. పక్షోత్సవాల్లో భాగంగా సర్వే నిర్వహించి కుష్ఠు వ్యాధి నుంచి కోలుకున్న రోగులు, అనుమానితుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తామన్నారు. సీహెచ్‌ఓ పి.వెంకటరత్నం, హెచ్ఈ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పీవీ రమణారావు, ఎస్.వెంకటేశ్వరరావు, పి.ఉమ, సీహెచ్ బేబి పాల్గొన్నారు.

అయినవిల్లిలో..

అయినవిల్లి: స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలోని 14 సబ్ సెంటర్లలో సోమవారం కుష్ఠు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు అయినవిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారులు బి.మంగాదేవి, జి.క్రిష్టోఫర్ తెలిపారు. తొలుత మహాత్మగాంధీ వర్ధంతి ఘనంగా జరిపారు. కుష్ఠు వ్యాధిపై జనవరి 30 నుంచి ఫిబ్రవరి 13 వరకూ సర్వేలు నిర్వహిస్తున్నామన్నారు.

నూతన క్యాలెండర్ ఆవిష్కరణ

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల్లో నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి ఆదేశాల మేరకు చెముడులంకలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, జొన్నాడలో సర్పంచ్ కట్టా శ్రీనివాసు, ఉప సర్పంచ్ నాంధ్ర నాగమోహన్‌రెడ్డి ఆవిష్కరించారు.

నేడు లక్ష చామంతి పూజ

కొత్తపేట: వానపల్లి గ్రామదేవత పళ్లాలమ్మ వారికి మంగళవారం లక్ష చామంతి పుష్పాలతో పూజ నిర్వహిస్తున్నట్టు దేవస్థానం ఈవో బొక్కా వీరవెంకటేశ్వరరావు తెలిపారు. మాఘ శుద్ధ దశమి మంగళవారం పురస్కరించుకుని లక్ష చామంతి పూజ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. భక్తులు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఈ పూజలో పాల్గొనవచ్చన్నారు. పూజలో పాల్గొనే భక్తులు రుసుముగా రూ.200 చెల్లించాలని పేర్కొన్నారు.

యువత క్రీడలపై ఆసక్తి చూపాలి

ఆత్రేయపురం: యువత క్రీడలపై ఆసక్తి చూపాలని రాష్ట్ర అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ డైరెక్టర్ కప్పల శ్రీధర్ అన్నారు. సోమవారం ర్యాలి గ్రామానికి చెందిన ఈలి రామారావు జ్ఞాపకార్థం కుమారుడు రామకృష్ణ వాలీబాల్ అసోసియేషన్‌కు జెర్సీలు అందజేశారు. అలాగే కప్పల శ్రీధర్ వాలీబాల్ పోల్స్ నిర్మాణానికి రూ.10 వేలు అందించారు. జెర్సీలు అందించిన రామకృష్ణ, శ్రీధర్‌లకు వాలీబాల్ యూత్ తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

భక్తులకు అసౌకర్యం లేకుండా చూడాలి

సఖినేటిపల్లి: అంతర్వేది క్షేత్రంలో స్వామివారి దర్శనానికై తరలి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా చూడాలని జిల్లా ఎస్పీ సుధీర్‌కుమార్ రెడ్డి సూచించారు. సోమవారం అంతర్వేది ఆలయ ప్రాంగణంలో ఉత్సవాలకు జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన వివిధ స్థాయిల్లోని సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఎస్పీ సిబ్బందికి దిశ, నిర్దేశం చేశారు. భక్తుల భద్రత విషయంపైన, డ్యూటీల విషయంపైన కూడా ఎస్పీ సలహాలు, సూచనలు చేశారు. అమలాపురం డీఎస్పీలు వై.మాధవరెడ్డి, కేవీ రమణ, వివిధ స్థాయిల్లోని సిబ్బంది పాల్గొన్నారు.

ఎడ్ల పందెం విజేతకు సత్కారం

ఆలమూరు: మండలంలోని గుమ్మిలేరుకు చెందిన పశుపోషకుడు కోరా వీరభద్రరావుకు సోమవారం సత్కారం జరిగింది. ఇటీవల జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పరుగు పందెంలో వీరభద్రరావుకు చెందిన ఎద్దులు ప్రథమ స్థానం సాధించాయి. గ్రామానికి రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చిన వీరభద్రరావుకు సర్పంచ్ గుణ్ణం రాంబాబు ఆధ్వర్యంలో గ్రామస్తులు సత్కరించారు. భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు సాధించాలని ఆకాంక్షించారు.